క్లుప్తంగా

సబ్ సెంటర్ల తనిఖీ



చిన్నారిని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

శ్రీరాంపూర్: నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాంపూర్ అరుణక్కనగర్, ఆర్కే 6 ఏరియాలోని ఆరోగ్య ఉప కేంద్రాలను మంచిర్యాల ఆరోగ్య అధికారులు శనివారం తనిఖీ చేశారు. మంచిర్యాల డివిజన్ సీహెచ్ఓ రామ్మూర్తి, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి నాందేవులు సెంటర్లను తనిఖీ చేసి నిర్వహణను పరిశీలించారు. సెంటర్లకు వచ్చిన తల్లులు, గర్భవతులతో మాట్లాడి ప్రభుత్వ దవాఖానాలో ప్రసవం చేసుకోవాలని దీనికి ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలను వారికి వివరించారు. అంతేకాకుండా తల్లిపాల ప్రాముఖ్యతను, పోషకాహారాలను గురించి వారికి అవగాహన కల్పించారు. డ్రై డే పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. సబ్ సెంటర్లలో హాజరు పట్టిక, మందులు అందిస్తున్న రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ సీ ప్రవళిక, ఏఎన్ఎంలు రజిత, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత 2డి ఎకో పరీక్షలు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని మయూరి ఆసుపత్రిలో శనివారం తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా 2డి ఎకో పరీక్ష మెగాక్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో 800తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులు చికిత్సను పొందుతుండగా, వారికి 2డి ఎకో పరీక్షలు నిర్వహించినట్లు రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు గోపాలకృష్ణ, సుబ్బరాయ భట్, రెడ్‌క్రాస్ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, ఎడ్ల కిషన్, కాసర్ల రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

స్టీల్ బ్యాంకు ప్రారంభం

మంచిర్యాలటౌన్: మున్సిపల్ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను బ్యాన్ చేయడంలో భాగంగా ప్లాస్టిక్‌కు బదులుగా స్టీల్ వస్తువులను వినియోగించుకునేందుకు స్టీల్ బ్యాంకును ప్రారంభిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ తెలిపారు. పట్టణ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా సంఘాల చేత ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంకును శనివారం కమిషనర్ ప్రారంభించారు. ఇందులో వెయ్యి మందికి సరిపోయే వంట పాత్రలు అన్నింటినీ అందుబాటులో ఉంచినట్లు, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మాదంశెట్టి సత్యనారాయణ, కౌన్సిలర్ మెరుగు మహేశ్వరి, టీఎంసీ చంద్రయ్య, సీవో సుజాత, అరుణ, సరోజ, పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు షహనాజ్ బేగం పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన ప్రవీణ్



కవితకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రవీణ్

బెల్లంపల్లి: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియామకమైన బెల్లంపల్లికి చెందిన రేణికుంట్ల ప్రవీణ్ శనివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవితను మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ప్రవీణ్ ప్రస్తుతం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా కొనసాగుతున్నారు.

కమిషనర్‌ను కలిసిన ఎస్సీ, ఎస్టీ నేతలు



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

శ్రీరాంపూర్: సింగరేణి సమస్యలపై సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాయకులు కేంద్ర ఎస్సీ, ఎస్టీ కమిషనర్ రామ్నాథ్ సుభాష్ పార్థీని కలిశారు. అసోసియేషన్ సెంట్రల్ ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు శనివారం ఢిల్లీకి వెళ్లి ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. సింగరేణిలో విజిలెన్స్ విభాగానికి సంబంధించిన పనులు సక్రమంగా జరగడం లేదని తెలిపారు. కొత్తగూడెం హెడ్ ఆఫీస్ వద్ద బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కంపెనీకి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కంపెనీలో ఎస్సీ లైజన్ సెల్‌ను కూడా ఏర్పాటు చేయాలన్నారు. సానుకూలంగా స్పందించారని నేతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు అంకుల్ జిమ్మిడి మల్లేష్ సుమన్ జాడి నరసయ్య, కృష్ణా తదితరులు పాల్గొన్నారు.

వినాయకా.. జెర పైలం!

- అసలే అంతంత మాత్రం రోడ్లు.. ఆపై గుంతలు
- మరమ్మతులపై పాలకుల నిర్లక్ష్యం
- భక్తుల ఇబ్బందులు పట్టని అధికారులు



బెల్లంపల్లి పోచమ్మ చెరువుకువెళ్లే రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు

బెల్లంపల్లి: వినాయక నవరాత్రి ఉత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. మరికొద్ది రోజుల్లో నిమజ్జన వేడుకలు జరగనున్నాయి. అయితే ఈ సారి ప్రజలకు దారికష్టాలు తప్పేటట్లు లేవు. గుంతలుపడి రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. బెల్లంపల్లితో పాటు తాండూర్, కాసిపేట, నెన్నెల, భీమిని, కన్నెపల్లి, వేమనపల్లి, బెల్లంపల్లి మండలాల పరిధిలోని గ్రామాల్లో రోడ్లు తీవ్ర దుస్థితిలో ఉన్నాయి. మరమ్మతులకు నోచుకోకపోవడంతో చెరువుల వద్దకు విగ్రహాలను తీసుకు వెళ్లడానికి నానా ఇక్కట్లు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఏటా రోడ్లు సరిగ్గా లేక భక్తులు విగ్రహాలను తీసుకెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నా, అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడంలేదని విమర్శలు వస్తున్నాయి.

తాండూర్ మండలంలో..



తాండూర్ మండలంలో ఏ ఒక్కగ్రామంలోనూ రోడ్లు సరిగా లేవు. చెరువుల వద్దకు విగ్రహాన్ని తరలించేందుకు యాతన పడక తప్పని పరిస్థితులు ఏర్పడ్డాయి. తాండూర్ పెద్దచెరువు, అచ్చులాపూర్ పెద్ద చెరువు, ద్వారకాపూర్ రాముని చెరువు, బోయపల్లి శీలంవాని చెరువు, గోపాల్‌రావు పేట గోపాల్‌నగర్ చెరువులకు వెళ్లడానికి సరైన రోడ్లు లేకుండా ఉన్నాయి. కొత్తపల్లి గ్రామ శివారులో ఉన్న చెరువుకు వెళ్లడానికి బురద రోడ్డు తప్పా, మరే ఆధారం లేదు. మండలంలో ఏ ఒక్కగ్రామంలో కూడా రోడ్లు మెరుగుపడ్డ దాఖలాలు లేవు.

బెల్లంపల్లి మున్సిపాలిటీలో....
మున్సిపాలిటీలో 34వార్డులు ఉన్నాయి. వీటిలో దాదాపు 30వార్డుల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను పోచమ్మ చెరువుకు తీసుకెళ్తుంటారు. కొందరు మంచిర్యాల శివారులో ఉన్న గోదావరికి తీసుకెళ్లి నిమజ్జనం చేస్తుండగా, మరికొందరు ఆయా వార్డుల శివారులో ఉన్న చెరువుల్లో నిమజ్జనం చేస్తుంటారు. మెజార్టీగా పోచమ్మ చెరువుకు తీసుకెళ్లే విగ్రహాలను సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయం క్రాస్ రోడ్ నుంచి గోల్‌బంగ్లా బస్తీ మీదుగా పోచమ్మ చెరువుకు తరలించి నిమజ్జనం చేస్తుంటారు. అయితే ఈ రోడ్డు పలుచోట్ల గుంతలు పడి, వరదనీరు నిలిచి రాకపోకలు సాగించడానికి ఇబ్బందికరంగా తయారైంది. గోల్‌బంగ్లాబస్తీ, పోచమ్మ గడ్డ దిగువన ఏర్పడ్డ గుంతలకు మరమ్మతు చేపట్టకపోవడంతో వినాయకుడి విగ్రహాలను తీసుకెళ్లడానికి సర్కస్ ఫీట్లు పడాల్సి వస్తుందేమోనని వినాయక మండపాల నిర్వాహకులు పేర్కొంటున్నారు.

బెల్లంపల్లి మండలంలో...
బెల్లంపల్లి మండలంలో చెరువుల వద్దకు వెళ్లడానికి మట్టి రోడ్లే దిక్కవుతున్నాయి. మాలగురిజాల, రంగపేట గ్రామాల భక్తులు ఉప్పర్ల చెరువుకు, తాళ్లగురిజాల వాసులు ఈదులచెరువు, చంద్రవెల్లి భక్తులు ఊరచెరువు, ఆకెనపల్లి ప్రజలు తుమ్మకుంట, రాళ్లపేట వాసులు శివారులో ఉన్న చెరువుకు, పాత బెల్లంపల్లి ప్రజలు ఊర చెరువుకు, దుగినేపల్లి, పెర్కపల్లి గ్రామాల భక్తులు శివారులో ఉన్న చెరువులకు తీసుకెళ్లి వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తారు. ఆయా గ్రామాల్లో మెరుగైన రోడ్లు లేకపోవడంతో బురద రోడ్లపై అవస్థలు పడాల్సి వస్తోంది.

కాసిపేట మండలంలో...
కాసిపేట మండలంలో మెజార్టీ గ్రామాల భక్తులు గోదారికి తీసుకెళ్లి నిమజ్జనం చేస్తారు. కొన్ని గ్రామాల భక్తులు గతేడాది నుంచి బుగ్గ ప్రాంతంలో ఉన్న బుగ్గ గూడెం చెరువుకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. చెరువు కట్టపై పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి చిత్తడిగా ఉన్నాయి. వీటిని సరిచేయాల్సి ఉంది.

వేమనపల్లి మండలంలో..
వేమనపల్లిలో బుయ్యారం, జిల్లెడ, జక్కేపల్లి, సూరారం, లక్ష్మీపురం, సుంపుటం, ముక్కిడిగూడెం, జాజుల పేట గ్రామాల భక్తులు సమీప చెరువులకు తీసుకెళ్లి నిమజ్జనం చేస్తుంటారు. చెరువుల వద్దకు మట్టిరోడ్లే ఉండటంతో బురదలో అవస్థలు పడుతూ వెళ్లాల్సి వస్తోంది. నీల్వాయి భక్తులు నీల్వాయి ప్రాజెక్టులో, వేమనపల్లి, దస్నాపూర్, మంగెనపల్లి, కొత్తపల్లి మరికొన్ని గ్రామాల భక్తులు ప్రాణహిత నదిలో నిమజ్జనం చేస్తారు.

భీమిని, కన్నెపల్లి, నెన్నెల మండలాల్లో...
భీమిని, కన్నెపల్లి,నెన్నెల మండలాల్లో నిమజ్జనానికి అంతగా ఇబ్బందులు పడే పరిస్థితులు లేవు. చెరువులు చేరువలో ఉండటంతో కాస్తా బురద ఉన్నప్పటికీ, ఇక్కట్లు పడే పరిస్థితులు లేకుండా ఉన్నాయి.

గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న భక్తులు

నస్పూర్: హిందుత్వ గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని తెలంగాణ తల్లి విగ్రహం నుంచి తాళ్లపల్లి ఆర్అండ్ఆర్ కాలనీ వరకు భక్తులు శనివారం ర్యాలీ నిర్వహించారు. కాషాయ జెండా చేత పట్టుకుని మహిళల కోలాటాలతో ర్యాలీని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సంపర్క్ ప్రముఖ్ విశేశ్వరశర్మ, జిల్లా సహకార్యవాహ మధూకర్, బాపూజి నగర సహ కార్యవహ స్వామి, ఉదయ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్, బీజేపీ కౌన్సిలర్ అగల్‌డ్యూటీ రాజు, కుమారస్వామి, పేరం రమేశ్, ప్రేంకుమార్, మాధవన్, సాయిరాం, అబి పాల్గొన్నారు.



ఆకట్టుకున్న ఫ్యాన్సీషో

మంచిర్యాలఅర్బన్: స్థానిక ఆదిత్య ఎన్‌క్లేవ్‌లో గణేష్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి చిన్న పిల్లల విభిన్న వేషధారణలు ఆకట్టుకున్నాయి. తెలుగుదనం ఉట్టిపడేలా ఫ్యాన్సీషో అబ్బురపరిచాయి. చిన్నారులకు వివిధ రకాల క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి వినాయక కమిటీ బహుమతులు అందజేశారు.

సంక్షిప్తం

చర్యలు తీసుకోవాలని రాస్తారోకో
జన్నారం: పెంబి మండలం రాజూరాలో బీజేపీ కార్యకర్తపై దాడికి పాల్పడిన ఖానాపూర్ సీఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం బీజేపీ నాయకులు జన్నారం మండల కేంద్రంలో ప్రధాన రాహదారిపై రాస్తారోకో చేశారు. సీఐని వెంటనే సస్పెండ్ చేయాలన్నారు.

ఆడపడుచులకు అండగా పీఎస్సార్
మంచిర్యాలటౌన్: నియోజకవర్గంలోని ఆడపడుచులకు మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అండగా ఉన్నారని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. జిల్లా కేంద్రంలోని 21, 32, 20, 07, 06, 19, 27, 25, 26, 29, 30, 36 వార్డుల్లోని మహిళలకు కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్టు ద్వారా బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు.

ట్రాన్స్‌కో ఏఈగా మోహన్
జైపూర్: మండల ట్రాన్స్‌కో ఏఈగా ఎస్.మోహన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆదిలాబాద్ జిల్లాలో పని చేసిన మోహన్‌ను జైపూర్ మండల విద్యుత్ ట్రాన్‌కో ఏఈగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయగా, ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు.

కాంగ్రెస్‌లో చేరిక
మందమర్రిరూరల్: మండలంలోని ఆదిల్‌పేట్ గ్రామంలో శనివారం పలువురు మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ నాయకురాలు రామిల్ల రాధిక కండువాలు కప్పి ఆహ్వానించారు. వేల్పుల లక్ష్మి, లింగపల్లి శారద, తిరుపతమ్మ, రమాదేవి తదితరులు ఉన్నారు.

భూమాచారికి మహిళల మద్దతు
జన్నారం: మండలంలో 132కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో సామాజిక వేత్త శ్రీరాముల భూమాచారి చేపట్టిన రిలే నిరహార దీక్షకు శనివారం మహిళలు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మహిళ సంఘ నాయకులు మూల రేణుక, శ్రీలత, సునీత, శంకరవ్వ, సునీతగౌడ్, కల్పనగౌడ్, కమల, శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.



జన్నారం: గణపతికి సమర్పించిన నైవేద్యాలు



తాండూర్: నైవేద్యాలు సమర్పిస్తున్న మహిళలు



వినాయకుడి వద్ద పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే



చెన్నూర్ రౌండ్ హనుమాన్ టెంపుల్‌లో...

వైభవంగా గణపయ్యకు పూజలు

జైపూర్/తాండూర్/వేమనపల్లి/చెన్నూర్/జన్నారం/మందమర్రిరూరల్/నస్పూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా వ్యాప్తంగా గణపతి నవరాత్రోత్సవాలు భక్తులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. పలు మండల కేంద్రాల్లో శనివారం మహిళలు కుంకుమ పూజలు చేశారు. మరికొందరు భక్తులు అన్నదానం చేపట్టారు. జన్నారంలో వర్తకసంఘం, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో, తాండూర్‌లో ప్రతిష్ఠించిన శ్రీ గణేషా భక్తమండలి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద బొజ్జ గణపయ్యకు 108రకాల నైవేద్యాలు సమర్పించారు. సల్లంగా చూడాలని వేడుకున్నారు. నస్పూర్ శ్రీ లక్ష్మీగణపతి దేవాలయంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందమర్రిలో ఏరియా జీఎం మనోహర్-సవిత దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



హాజీపూర్‌లో భక్తుల పూజలు



పూజలో పాల్గొన్న ఏరియా జీఎం దంపతులు

అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

దండేపల్లి: గ్రామ పంచాయతీలకు పక్కా భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందని ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. దండేపల్లి మండలం చింతపల్లిలో నూతన పంచాయతీ భవన నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పరిపాలన సౌలభ్యం కోసం తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే అన్నారు. పాత, కొత్త పంచాయతీలకు అవసరమున్న చోట పక్కా భవనాలు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అనిల్, పీఏసీఎస్ చైర్మన్ లింగన్న, రైతుసమితి జిల్లా కన్వీనర్ గురువయ్య, సర్పంచ్ దేవేంద్ర, ఉపసర్పంచ్ తిరుపతి, ఎంపీటీసీ రాజన్న, ఎంపీడీవో మల్లేశం, పీఆర్ఏఈఈ విక్రంరెడ్డి, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, పూర్తయిన పనుల ప్రారంభోత్సవాన్ని శనివారం ఎమ్మెల్యే దివాకర్‌రావు చేపట్టారు. 1వ వార్డులోని రాజీవ్‌నగర్‌లో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.2కోట్లతో నూతనంగా నిర్మించే ఆధునిక దోభి ఘాట్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. 9వ వార్డులోని సాయిబాబ ఆలయం వెనుక రూ.20లక్షల పంచాయతీరాజ్ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ భవనంను, 8వ వార్డులోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో అదనపు గదులను రూ.15 లక్షల డీఎఫ్‌టీ నిధులతో ప్రారంభించి, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రూ.9లక్షల నిధులతో నిర్మించిన అదనపు గదులను ప్రారంభించారు.

దోమలు అరికట్టేందుకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



ఆయిల్ బాల్స్ వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మంచిర్యాలటౌన్: ఈ నెల 22వ తేదీన 'పారిశుధ్యం అస్తవ్యస్తం' అనే శీర్షికన 'సాక్షి'లో వచ్చిన కథనానికి మంచిర్యాల మున్సిపల్ అధికారులు స్పందించారు. పట్టణంలో పెరుగుతున్న విషజ్వరాలతో పాటు, ప్రజలు డెంగీ బారిన పడుతున్నారని కథనం ప్రచురించగా, మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ ఆధ్వర్యంలో దోమలను అరికట్టేందుకు పట్టణంలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్‌ను వేయించారు. దీంతో పాటు, పలు కాలనీల్లో ఫాగింగ్ చేయించారు.

పాఠశాల ఎదుట ఆందోళన



ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

రామకృష్ణాపూర్: గద్దెరాగిడిలోని గ్రీన్‌వుడ్ పాఠశాల ఎదుట శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. సీబీఎస్ఈ పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తూ మోసం చేస్తున్నారని పేర్కొంటూ పాఠశాల గేటు ఎదుట ధర్నా చేపట్టారు. పాఠశాల యాజమాన్యంతో వాగ్వాదానికి దిగారు. సీబీఎస్ఈ గుర్తింపు లేనందునా, ఫీజులు తక్కువ చేయాలని డిమాండ్ చేశారు.

పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం జరగాలి



పనులు పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి

కోటపల్లి: గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం జరగాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు ఆదేశించారు. రాజారం గ్రామపంచాయతీని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలోని అన్ని కాలనీల్లో తిరిగి శానిటేషన్ పనులు పరిశీలించారు. గ్రామ పంచాయతీలోని ప్రతిరోడ్డు, నాలీలు శుభ్రంగా ఉంచాలని, ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించాలని సూచించారు. ట్రాక్టర్‌తో చెత్తసేకరించి డంపింగ్‌యార్డులో వేయాలని తెలిపారు. శ్మశానవాటిక, కంపోస్టు షెడ్డు పరిశీలించి, చుట్టూ మొక్కలు నాటించి నీరు నిలిచిన చోట ఆయిల్‌బాల్స్ వేయాలని సూచించారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీవో అక్తర్, ఉపసర్పంచ్ తిరుపతిరావు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య

తాండూర్: ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని ఎమ్మెల్యే చిన్నయ్య అన్నారు. ఎంపీపీ ప్రణయ్ అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పలు శాఖల అధికారులు అభివృద్ధి నివేదికలను చదివి వినిపించగా ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. విద్యుత్‌శాఖ,పంచాయతీ రాజ్, అటవీశాఖ అధికారులకు ప్రజలకు ఇబ్బంది కలిగే చర్యలను మానుకోవాలని హితవు పలికారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో జెడ్పీటీసీ సాలిగామ బానయ్య, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, సింగిల్ విండో చైర్మన్ దత్తుమూర్తి, మండల పరిధిలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు సీపీఐ కౌన్సిల్ సమావేశం

కాసిపేట: బెల్లంపల్లి నియోజకవర్గంలోని ఏడు మండలాలు, బెల్లంపల్లి పట్టణం కౌన్సిల్ సమావేశం ఆదివారం బెల్లంపల్లి సీపీఐ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్ తెలిపారు. సోమగూడెంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేస్తూ, గ్రామశాఖ, బూత్ కమిటీ సభ్యులకు దిశా నిర్దేశం చేయనున్నట్లు, సభ్యులందరూ పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరారు. సమావేశానికి ముఖ్యఅతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ హాజరు కానున్నట్లు తెలిపారు.

చీరలు పంపిణీ

దండేపల్లి: వెర్రబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో దండేపల్లి మండలం లోని లింగాపూర్, మాకులపేట, నాగసముద్రం గ్రామాల్లోని మహిళలకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెర్రబెల్లి రఘునాథ్, బతుకమ్మ కానుకగా, శనివారం చీరలు పంపిణీ చేశారు.

సమస్యలు పరిష్కరించాలి
కాసిపేట/జన్నారం/భీమిని/దండేపల్లి: సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె కొనసాగుతుంది. సమ్మెకు సీఐటీయూ, ఆశ కార్యకర్తలు, కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేకుంటే సమస్య పరిష్కరించేంత వరకు ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దండేపల్లిలో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు.

నేడు సాహితీ సంరక్షణ సమావేశం
మంచిర్యాలఅర్బన్: స్థానిక సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో 24న జిల్లా సాహితీ సంరక్షణసమితి సమావేశం జరుగుతుందని సంస్థ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. తెలంగాణ తొలి మలిదశ ఉద్యమ కారుడు విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు పద్యకవి మలయశ్రీ రచించిన మలయమారుతాలు, వందేమాతరం గేయసంపుటి, పుస్తకపరిచయ కార్యక్రమం ఉంటుందన్నారు.